సాక్షి
ఆదిలాబాద్

సోమవారం, 9, సెప్టెంబర్, 2024


బ్రాహ్మణవాడ శాస్త్రి మందిరంలో ముక్కోటి ఆకారంలో..



మహా గణేశుని వద్ద ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్



జిల్లా కేంద్రంలోని తిర్పెల్లిలో..

# జై గణేశా..

- వాడవాడన కొలువుదీరిన గణనాథుడు
- తొలి పూజలందుకున్న వినాయకుడు

వినాయక చవితి వేడుకలను జిల్లావాసులు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గణనాథుడిని డప్పుచప్పుళ్లు, చిన్నారుల కేరింతల నడుమ ఆయా మండపాలకు చేర్చారు. వాడవాడన కొలువుదీరిన విఘ్ననాయకుడు భక్తుల తొలి పూజలందుకున్నాడు. జిల్లాకేంద్రంలోని కుమార్ జనతా గణేశ్ మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన 52 అడుగుల మహా వినాయకున్ని ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎస్పీ గౌస్ ఆలం దర్శించుకున్నారు. అదనపు ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ జీవన్‌రెడ్డి తొలిపూజలో పాల్గొన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కొలువుదీర్చిన గణేశునికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ పూజలు నిర్వహించారు. – ఆదిలాబాద్


భుక్తాపూర్‌లో కొలువుదీరిన గణనాథుడు


శాంతినగర్‌లో కొలువుదీరిన వినాయకుడు


ద్వారకానగర్‌లో ఉయ్యాల ఊగుతూ..


కుమార్‌పేట్‌లో..


రాజీసతీజీ ఆలయం వద్ద ..


క్యాంపు కార్యాలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

## న్యూస్‌రీల్

### హైదరాబాద్ ప్రజావాణి వాయిదా

కైలాస్‌నగర్: హైదరాబాద్‌లోని జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ప్రతీ మంగళవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 11కు వాయిదా వేసినట్లు ప్రజాపాలన రాష్ట్ర ప్రత్యేక అధికారి డి.దివ్య తెలిపినట్లుగా కలెక్టర్ రాజర్షిషా ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 10న ప్రజాభవన్‌లో 16వ కేంద్ర ఆర్థిక సంఘంతో సమావేశం నేపథ్యంలో గ్రీవెన్స్‌ను బుధవారానికి మార్చినట్లుగా ఆయన పేర్కొన్నారు. విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు.

### విఠలేశ్వర ఆలయ మండప నిర్మాణానికి కృషి


మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్

ఇచ్చోడ: విఠలేశ్వర ఆలయ మండప నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ఆలయంలో వైష్ణవసదన్ పీఠాధిపతి నారాయణ్ మహరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం సత్సంగ్ నిర్వహించారు. ఎంపీ హాజరై మాట్లాడుతూ, వెయ్యి సత్సంగ్‌లను నారాయణ్ మహరాజ్ పూర్తి చేయ డం అభినందనీయమని కొనియాడారు. ఇందులో బాబారావు, రవీంద్రనాథ్, సూర్యకాంత్, భక్తులు పాల్గొన్నారు.

### పెండింగ్ డీఏలు విడుదల చేయాలి


మాట్లాడుతున్న లచ్చిరాం

ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాం అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పీఆర్సీ నివేదిక తెప్పించుకొని అమలు చేయాలని కోరారు. జీవో నం .317 ప్రకారం చాలామంది ఉపాధ్యాయులు స్థానికేతరులుగా వేరే జిల్లాల్లో పనిచేస్తున్నారని, వారిని సొంత జిల్లాలకు తీసుకురావాలని పేర్కొన్నారు. నిలిచిపోయిన 13 జిల్లాల స్పౌజ్ బదిలీలు చేపట్టాలన్నారు. సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బేర దేవన్న, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శ్రీకాంత్ ఎం.జలందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట్‌రావు, ఎ.భూమన్న, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

# మెరుగుపడేనా..?

- విద్యార్థుల సామర్థ్యాలకు 'పరీక్ష'
- నవంబర్ 19న 'న్యాస్' ఎగ్జామ్
- ఈ సారి ఫోకస్ పెంచిన విద్యాశాఖ

| |
|---|
| జిల్లాలో మొత్తం పాఠశాలలు : 1,439 |
| ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు : 739 |
| విద్యార్థుల సంఖ్య : 1,35,323 |
| 2017లో న్యాస్ ఫలితాలు: లోపర్ఫామెన్స్ జిల్లా (ఎల్‌పీడీ) |
| 2021లో న్యాస్ ఫలితాలు : 34 శాతం |


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రణీత (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: దేశవ్యాప్తంగా నిర్వహించనున్న న్యాస్ పరీక్షలో జిల్లా విద్యార్థుల ప్రతిభ తేలనుంది. విద్యార్థులతో పాటు గురువుల బోధన తీరు స్పష్టం కానుంది. గతంలో జాతీయ స్థాయిలో పది జిల్లాలు చదువులో వెనుకబడగా, అందులో ఆదిలాబాద్ జిల్లా నిలిచిన విషయం తెలిసిందే. ఈ సారైనా పరువు దక్కుతుందా అనేది త్వరలో తేలనుంది. జిల్లాలో విద్యా ప్రమాణాలు సన్నగిల్లుతున్నాయి.. చదువులు కుంటుపడుతున్నాయి.. చాలా మంది విద్యార్థులు చదవడం, రాయడం మర్చిపోతున్నారు. అంకెలు సైతం గుర్తించలేకపోతున్నారు. ఇందుకు అనేక కారణాలు లేకపోలేదు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించేందుకు కేంద్ర విద్యాశాఖ నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్) పరీక్ష నిర్వహిస్తోంది. 2017లో నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాల్లో దేశంలోనే 'లో పర్ఫామెన్స్'గా ఆదిలాబాద్ నమోదైంది. 2021లో నిర్వహించిన పరీక్షలో గతంతో పోల్చితే పర్వా లేదనే విధంగా 34 శాతం మాత్రమే సామర్థ్యం ఉన్నట్లు తేలింది. జిల్లాలో కనీసం 50 శాతం మంది విద్యార్థులు కూడా కనీస సామర్థ్యాలు లేకపోవడం సర్కారు బడుల పనితీరుకు అద్దం పడుతుంది. ఈసారైనా కనీసం 50 శాతం మంది విద్యార్థులు సామర్థ్యాలు మెరుగుపర్చుకుంటారనేది ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు పరీక్షగా మారింది. కలెక్టర్ రాజర్షిషా దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే ఆ శాఖ అధికారులతో పలుమార్లు సమీక్షలు సైతం చేశారు.

**సన్నగిల్లుతున్న చదువులు..**

జిల్లాలో ప్రాథమికస్థాయి నుంచి ఉన్నత తరగతుల వరకు సర్కారు బడుల్లో చాలా మంది విద్యార్థులు చదువులో వెనుకబడ్డారు. ఉపాధ్యాయుల కొరత, అధికారుల పర్యవేక్షణ లోపం, మౌలిక వసతులు లేకపోవడం కారణంగా చెప్పుకోవచ్చు. పదో తరగతి విద్యార్థుల్లో సైతం కొంత మందికి చతుర్విధ ప్రక్రియలు, రాయడం, చదవడం రాకపోవడం గతంలో నిర్వహించిన న్యాస్ ఫలితాల్లో వెల్లడైంది. ఈ క్రమంలో విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు విద్యాశాఖ దృష్టి సారించింది. అయితే పూర్తిస్థాయిలో గాడిన పడినట్లు కనిపించడం లేదు. జిల్లాలోని 15 ప్రాథమిక పాఠశాలల్లో బోధించేందుకు ఒక్క ఉపాధ్యాయు కూడా లేకపోగా, 186 పాఠశాలలు ఏకోపాధ్యాయులతోనే కొనసాగుతున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడితో బోధన జరగడంతో చదువులు కుంటుపడుతున్నట్లు తెలుస్తోంది. ఉన్నత పాఠశాలల్లో కూడా సబ్జెక్ట్ టీచర్ల కొరత వేధిస్తుంది. విద్యార్థులు సక్రమంగా బడికి రాకపోవడంతోనూ చదువుల్లో వెనుకబడిపోతున్నారు.

**జిల్లాలో 300 పాఠశాలల్లో పరీక్ష..**

2017, 2021 సంవత్సరాల్లో జిల్లాలో న్యాస్ పరీక్ష నిర్వహించారు. ఆ సమయంలో 3, 5, 8 తరగతుల విద్యార్థులు హాజరయ్యారు. 2017లో నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా చివరి స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా విద్యలో వెనుకబడిన పది జిల్లాల్లో ఆదిలాబాద్ ఒకటి. 2021లో నిర్వహించిన పరీక్షలో 34 శాతం మంది విద్యార్థుల సామర్థ్యాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ విద్యా సంవత్సరానికి గాను నవంబర్ 19న దేశ వ్యాప్తంగా ఈ పరీక్ష నిర్వహించనున్నారు. అంతకుముందు ఎస్‌సీఈఆర్టీ మూడు విడతలుగా సెప్టెంబర్ 10, సెప్టెంబర్ 30, నవంబర్ 8న మాక్ టెస్ట్‌లు నిర్వహించనుంది. జిల్లాలో దాదాపు 300 పాఠశాలల్లో న్యాస్ పరీక్ష నిర్వహించనున్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

### మెరుగైన ఫలితాలు సాధిస్తాం..

జాతీయ స్థాయిలో నిర్వహించే న్యాస్ పరీక్షలో ఈ సారి మెరుగైన ఫలితాలు సాధిస్తామనే నమ్మకముంది. ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మాక్ టెస్ట్‌లు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపర్చేలా చర్యలు చేపడుతున్నాం. ఈసారి 3,6,9వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలతో పాటు ప్రైవేట్‌లో చదివే విద్యార్థులకు కూడా పరీక్ష నిర్వహించనున్నాం. – ప్రణీత, డీఈవో

# ఓ వర్గానికే ప్రభుత్వం కొమ్ముకాస్తోంది

- ఆదివాసీల మాన, ప్రాణాలకు విలువ లేకుండా పోయింది
- జైనూర్ ఘటనలో రాష్ట్ర సర్కారుది ఏకపక్ష ధోరణి
- ఆదివాసీలపై మాత్రమే కేసులు పెడుతున్నారు
- ఎంపీ గోడం నగేశ్


మాట్లాడుతున్న ఎంపీ నగేశ్, పక్కన ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: జైనూర్ ఘటనలో రాష్ట్ర ప్రభుత్వం ఓ వర్గానికి మాత్రమే కొమ్ము కాస్తుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. జైనూర్‌లో ఆదివాసీ మహిళపై జరిగిన అత్యాచారం, హత్యాయత్న ఘటనపై ఆదివాసీలు శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారన్నారు. అయితే మరో వర్గం వారు రాళ్లు రువ్వడం కారణంగానే అక్కడ అల్లర్లు చెలరేగాయని పేర్కొన్నారు. ఈ ఘటనలో కేవలం ఒక వర్గం వారికి సంబంధించిన ఆస్తులు మాత్రమే దగ్ధమయ్యాయని అసత్య ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ ఘటనలో ఇరువర్గాలకు సంబంధించిన వారి ఆస్తులు ధ్వంసం అయ్యాయని వివరించారు. ఘటనకు బాధ్యులైన వారిలో కేవలం ఆదివాసీలపైనే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. గతంలో సైతం వడ్డెరగూడలో స్థానికులపైన ఓ వర్గం వారు దాడి చేసిన ఘటనలో బాధితుల పైనే కేసులు పెట్టారని విమర్శించారు. ప్రభుత్వ ఏకపక్ష ధోరణికి ఇది నిదర్శనమన్నారు. ఆస్తులకు ఉన్న విలువ, ఆదివాసీల మానప్రాణాలకు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ శాంతిభద్రతలు అదుపులో ఉండాలని తాము సైతం కోరుకుంటున్నామని, ఈ దిశగా అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అయితే కేవలం ఆదివాసీలను బాధ్యులను చేస్తూ కేసులు పెట్టడం సమంజసం కాదన్నారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ హిందువులను టార్గెట్‌గా చేసుకొని రాజకీయ పబ్బం గడుపుకునేందుకు ప్రభుత్వం మరో వర్గాన్ని కాపాడుతుందని విమర్శించారు. అమాయక ఆదివాసీలపై కేసులు నమోదు చేస్తే శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడుతుందన్నారు. దేశ సరిహద్దుల్లో పనిచేసే ఓ జవాన్ కుటుంబానికి చెందిన బట్టల షాపును దుండగులు తగలబెట్టారని, ఆయన అక్కడి నుంచి ఫోన్లో తన ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఇందులో నాయకులు నగేశ్, లాలా మున్నా, రఘుపతి, తదితరులున్నారు.

# మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

ఆదిలాబాద్: వినాయక చవితి పురస్కరించుకొని సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మట్టి వినా యక ప్రతిమల పంపిణీ శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే శంకర్ అతిథిగా హాజరై మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించాలని కోరారు. అలాగే జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రంగినేని మనీషా మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. ఇందులో మఠాధిపతి శ్రీయోగానంద సరస్వతీ, ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్‌ఖత్రి, జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, తెలంగాణ జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ ప్రకాశ్, సమితి గౌరవ అధ్యక్షుడు బండారి వామన్, గేడం మాధవ్, రవీందర్, శశికళ చౌహాన్, లచ్చు తదితరులు పాల్గొన్నారు.


ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

**పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత**

కైలాస్‌నగర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ అన్నారు. వినాయక చవితి పురస్కరించుకుని మున్సిపల్ ఆధ్వర్యంలో శనివారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఇందులో మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# వరద నష్టంపై నివేదిక అందించాలి

- జిల్లా ప్రత్యేకాధికారి భవేష్ మిశ్రా
- ఆయా శాఖల అధికారులతో సమీక్ష


మాట్లాడుతున్న భవేష్ మిశ్రా

కైలాస్‌నగర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో జరిగిన నష్టంపై పూర్తిస్థాయిలో నివేదిక సమర్పించాలని జిల్లా ప్రత్యేకాధికారి భవేశ్ మిశ్రా అన్నారు. జిల్లా కేంద్రానికి ఆదివారం వచ్చిన ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో వరద నష్టంపై సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంట నష్టపోయిన రైతులు, ఇళ్లు కూలిపోయిన బాధితుల వివరాలతో పాటు ధ్వంసమైన రోడ్లు, విద్యుత్ స్తంభాలు, ఇతరత్రా నష్టం వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. మేజర్, మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించిన ప్రాజెక్టులు, చెరువులు ధ్వంసమైనట్లైతే వాటి వివరాలు సైతం అందించాలని సూచించారు. అంతకు ముందు కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. సమావేశంలో సీపీవో వెంకటరమణ, ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సయ్య, డీఎంహెచ్‌వో కృష్ణ, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జేఆర్ చౌహాన్, డీఏవో శ్రీధర్‌స్వామి, ఆర్డీవోలు వినోద్ కుమార్, జివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: మిలాద్-ఉన్-నబీ పండగను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. పట్టణంలోని టూటౌన్ పోలీసుస్టేషన్‌లో మిలాద్-ఉన్-నబీ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. పలు విషయాలపై చర్చించారు. పండుగను 16న నిర్వహించి 19న ర్యాలీ చేపట్టాలని కోరగా, మతపెద్దలు ఒప్పుకున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ అన్ని మతాలను గౌరవించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్, టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు, మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# తప్పిపోయి.. 12 ఏళ్లకు ఇంటికి

- తిరుపతిలో తప్పిపోయి.. హైదరాబాద్‌లో ప్రత్యక్షం
- కన్న కూతురే భిక్షాటన చేస్తున్న తండ్రిని గుర్తు పట్టిన వైనం


కుటుంబసభ్యులతో తుకారాం

బోథ్: పుష్కర కాలం క్రితం తిరుపతిలో తప్పిపోయిన ఆ కుటుంబ పెద్ద అచూకీ ఎట్టకేలకు లభించింది. హైదరాబాద్‌లో భిక్షాటన చేస్తున్న ఆ తండ్రిని కన్న కూతురే గుర్తు పట్టి ఇంటికి చేర్చింది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని గుట్టపక్క తండా గ్రామానికి చెందిన తుకారాం 12 ఏళ్ల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి దర్శనానికి వెళ్లారు. ఈ క్రమంలో తుకారాం అక్కడ తప్పిపోయాడు. మూడేళ్ల పాటు పలుచోట్ల వెదికినా తండ్రి ఆచూకీ లభించలేదని పెద్ద కుమారుడు సుందల్‌సింగ్ తెలిపాడు. మృతి చెంది ఉంటాడని అంతా భావించారు. అయితే తుకారాం పెద్ద కుమార్తె హైదరాబాద్‌లోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తుంది. ఈ క్రమంలో సమీపంలో ఓ వ్యక్తి ప్రతిరోజు భిక్షాటన చేస్తుండగా తన తండ్రిలాగే ఉండడం గమనించిన ఆమెకుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. వారంతా శనివారం హైదరాబాద్ వెళ్లి ఆయనను గుర్తుపట్టారు. అయితే ఎంత పలకరించినా మాట్లాడకపోవడంతో మతిస్థిమితం కోల్పోయి ఉండవచ్చని భావించారు. తుకారాం ఆధార్‌కార్డు సాయంతో అతడి వేలిముద్రలు సరిపోవడంతో నిర్ధారించుకున్నారు. పుష్కరకాలం తర్వాత ఇంటిపెద్ద ఇంటికి రావడంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

## క్లుప్తంగా

### పిప్పల్‌కోట్ వాసి అదృశ్యం.. మహారాష్ట్రలో విగతజీవిగా



నారాయణ (ఫైల్)

తాంసి: భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమై మహారాష్ట్రలో విగతజీవిగా పడి ఉన్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు..పిప్పల్‌కోటికి చెందిన జానకొండ నారాయణ(38) రజక వృత్తి చేసుకుని జీవిస్తున్నాడు. ఈనెల 5న ఇంటికి సరుకులు తెస్తానని భార్య విజయలక్ష్మికి చెప్పి ఆదిలాబాద్ వెళ్లాడు. రెండు రోజులుగా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు శనివారం ఫిర్యాదు చేయగా ఎస్సై కలీం అదృశ్యం కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా జిల్లా సరిసద్దుగా ఉన్న మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా పరిధిలో పిప్పల్‌గావ్ అటవీ ప్రాంతంలో వ్యక్తి కాలిపోయిన స్థితిలో మృతదేహం లభ్యమైంది. ఆదివారం సమాచారం తెలుసుకున్న భార్య అక్కడికి వెళ్లి పరిశీలించి భర్త మృతదేహంగా గుర్తించింది. మాండ్వి పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. మృతదేహం పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా ఇది హత్యనా లేక ఆత్మహత్యనా అనేది పోస్టుమార్టం రిపోర్టు తర్వాత తెలియనుంది. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### వాగు దాటుతుండగా అదుపుతప్పిన ఎడ్లబండి



వాగులో ఈదుకుంటూ బయటకు వస్తున్న రైతులు

జైనథ్: మండలంలోని పెండల్‌వాడ వద్ద సాత్నాల వాగు అవతల రైతులకు వ్యవసాయ భూములు ఉన్నాయి. సాత్నాల బ్రిడ్జి లేకపోవడంతో ప్రతిరోజూ ఎడ్లబండిపై వాగులో నీటి నుంచి వెళ్లి వ్యవసాయం చేస్తుంటారు. ఆదివారం రైతులు నాగుల అరుణ్, భొనే లక్ష్మణ్ ఎడ్లబండిపై ఛాతీ లోతు నీళ్లలో వాగు దాటుతుండగా అదుపు తప్పి ఎక్కువ లోతు వైపు ఎడ్లు వెళ్లిపోయాయి. గమనించిన రైతులు చాకచక్యంగా వ్యవహరించి ఈదుకుంటూ బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. అక్కడే ఉన్న ఇతర రైతులు సహకరించడంతో ఎడ్లు సురక్షితంగా బయటపడ్డాయి.


### 'ప్రాజెక్ట్‌ల నుంచి నీటిని వదలలేదు'

కైలాస్‌నగర్: జిల్లాలోని సాత్నాల, మత్తడి వాగు ప్రాజెక్ట్‌ల క్యాచ్‌మెంట్ ఏరియాలో ఈనెల 7న తక్కువ వర్షపాతం నమోదైనందునా ఆ రెండు ప్రాజెక్ట్‌ల నుంచి గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయలేదని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఓ ప్రకటనలో తెలిపారు. బంగారుగూడ, అనుకుంట, యాపల్‌గూడ, హస్నాపూర్, ఆదిలాబాద్‌లోని వాగుల క్యాచ్‌మెంట్‌లో కురిసిన వర్షాలతో పైవాగుల్లో నీటిమట్టం పెరిగి వాగులు కలవడం ద్వారా పెండల్‌వాడ వద్ద నీటిమట్టం పెరిగి ఉండవచ్చని పేర్కొన్నారు. రెండు ప్రాజెక్టుల పరిధిలోని దిగువ గ్రామాల్లోని ప్రజలు వాగులు దాటేందుకు ప్రయత్నించొద్దని తెలిపారు.

# భాషకు యాసే శ్వాస

తెలంగాణ 'యాస'నెపుడు
యీసడించు భాషీయుల
'సుహృద్భావన'ఎంతని
వర్ణించుట సిగ్గుచేటు..!
అని తెలంగాణ యాసను విమర్శించే వారికి కాళోజీ దీటుగా బదులిచ్చారు.

అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు
సంతృప్తి..
అన్యాయం అంతరిస్తే నా గొడవకు
ముక్తిప్రాప్తి..
అన్యాయాన్నెదిరించిన వాడే
నాకారాధ్యుడు..'
అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించారాయన.




- ప్రాంతీయ మాండలికమే ఆయువుపట్టు
- తెలంగాణ భాష పరిరక్షణకు కృషిచేస్తున్న జిల్లా కవులు
- నేడు తెలంగాణ భాషా దినోత్సవం

తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఆంగ్ల భాషల్లో రచయితగా కాళోజీ పేరు గడించారు. 'నా గొడవ'పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై ముక్కుసూటిగా స్పందించి..పాలకులపై అక్షరాయుధాలను సంధించారు. తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహాన్ని ఆయన గేయాలు కళ్లకు కడతాయి. ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా సెప్టెంబర్ 9న తెలంగాణ భాషా దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ నేపథ్యంలో కథనం.

నిర్మల్‌ఖిల్లా: తెలుగు భాష ఒక్కటైనా, మాండలికాలెన్నో..ఆంధ్రులు మాట్లాడే విధానానికి, తెలంగాణ ప్రజలు మాట్లాడే భాషకు మధ్య వ్యత్యాసం ఉంటుంది. తెలంగాణ యాస వినసొంపుగా ఉంటుంది. నిజాం పాలనలో ఉర్దూ ప్రాబల్యాన్ని తట్టుకుని మరీ తెలంగాణ ప్రాంతంలో తెలుగు నిలబడింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయ్యాక ఉర్దూ కలగలిసిన తెలంగాణ ప్రజల యాసను కొందరు హేళన చేశారు. దీన్ని తెలంగాణ కవులు తీవ్రంగా ప్రతిఘటించారు. అలాంటి వారిలో కాళోజీ నారాయణరావు ఒకరు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన.. తెలుగు భాషపై, తెలంగాణ యాసపై ఎనలేని ప్రేమ కనబర్చారు. నిర్మల్ జిల్లాలో ప్రధానంగా మూడు రకాల మాండలికాలు కనిపిస్తాయి. జిల్లా కేంద్రం పరిసర ప్రాంతాలు, భైంసా, ఖానాపూర్ ప్రాంతాల్లో స్థానిక భాషలో వైవిధ్యం కనిపిస్తుంది. వివిధ రకాల యాసలతోపాటు భాషా మండలికాలు వాడుకలో ఉన్నాయి. జిల్లాకు చెందిన కవులు కూడా తమ రచనల్లో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ తెలంగాణ భాష పరిరక్షణ కోసం తమవంతు పాత్ర పోషిస్తున్నారు.

### మాండలికంతో భాషకు మనుగడ



తెలంగాణలో తెలుగు భాషకు యాస మాండలికం ప్రత్యేకం. స్థానిక శైలిలో మాట్లాడే భాషకు ప్రాధాన్యత ఉంది. తెలంగాణ యాసకు విభిన్న శైలితో ప్రత్యేకత సంతరించుకుంది. ఈ మాండలికాన్ని కాపాడుకుంటేనే తెలంగాణ భాషకు మనుగడ ఉంటుంది. మాట్లాడే విధానంలో తెలంగాణ సాహిత్యంలో భిన్నత్వం కనిపిస్తుంది.
– డాక్టర్ యు. కృష్ణంరాజు, కవి నిర్మల్

### వ్యవహారికమే భాషకు ఆయువుపట్టు



తెలుగు భాషలో తెలంగాణ వ్యవహారికం వేరుగా ఉంటుంది. స్థానిక ప్రజలు మాట్లాడే వ్యవహారిక భాషనే ఆయువుపట్టుగా ఉంటుంది. తెలంగాణ యాసలో 'అవును..నేను ఆదిలాబాదోన్నే 'అనే కవిత సంకలనాన్ని స్థానిక వ్యాసాల్లో రచించాను. వందలాది మందితో మమేకమయ్యే సందర్భంలో భాషకు ఉన్న విభిన్న కోణాలు తెలుసుకోగలుగుతాం.
– డా.అప్పాల చక్రధారి, కవి, వైద్యనిపుణుడు

### స్థానిక భాష ప్రాధాన్యత తెలపాలి



తెలంగాణ భాషను పరిరక్షించుకునేలా రాబోయే తరాలకు దాని ప్రాధాన్యతను స్థానిక వ్యవహారికాన్ని తెలియజెప్పాల్సిన అవసరం ఉంది. కవులు, కళాకారులు, భాషోపాధ్యాయులు తెలంగాణ యాస, భాషను అందులోని పద పరిమళాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలి. తెలంగాణ యాస, భాష ప్రతిబింబించే రచనలకు ప్రాధాన్యత ఇవ్వాలి. – తుమ్మల దేవరావు, కవి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

# దళితులపై రాళ్లదాడి



దళితుల ఇంట్లో విసిరిన రాళ్లు



వివరాలు సేకరిస్తున్న భైంసా ఏఎస్పీ

- ఝరి(బి)లో గణేశ్ ప్రతిష్టిస్తుండగా ఘటన
- అదే సమయంలో ఓ ఇంట్లో చిన్నారి బర్త్ డే
- గణేశ్ మండపం వైపు రాళ్లు విసిరిన గుర్తుతెలియని వ్యక్తులు
- ఇరువర్గాల మధ్య ఘరణ
- గ్రామాన్ని సందర్శించిన భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్

తానూరు: మండలంలోని ఝరి(బి) గ్రామంలో శనివారం రాత్రి గణేశ్ ప్రతిష్ఠాపన జరుగుతోంది. అక్కడే దళితవాడలో ఓ ఇంట్లో చిన్నారి పుట్టిన వేడుకలు నిర్వహిస్తున్నారు. గణేశ్ ప్రతిష్ఠాన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మండపం వైపు రాళ్లు విసిరారు. గణేశ్ మండలి సభ్యులు దళితవాడకు చేరుకుని మీరే రాళ్లు విసిరారని అనడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దళితులపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఇరువురు రాళ్లదాడితో గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. గణేశ్ మండలి సభ్యులు బర్త్ డే జరుగుతున్న ఇంటికి వెళ్లి రాళ్లదాడి చేశారు. ఇందులో పద్మబాయి, పూజ, సంఘమిత్ర, గౌతమి, రాధికలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, ముధోల్ సీఐ మల్లేశ్ గ్రామాన్ని సందర్శించారు. ఇరువర్గాల వారిని సముదాయించి వివరాలు సేకరించారు. రాళ్లదాడిలో గాయాలైనవారిని చికిత్స నిమిత్తం భైంసాలోని ప్రభుత్వ తరలించారు. ఇరువురు ఫిర్యాదులతో ఆదివారం 13 మంది దళిత యువకులపై కేసు, 11 మంది గణేశ్ మండలి యువకులపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.



తానూరు పోలీస్ స్టేషన్ ఎదుట గాయపడిన దళిత మహిళలు

# మృగాడికి ఉరిశిక్ష పడేంత వరకు ఉద్యమిస్తాం

- ఉమ్మడి జిల్లా తొమ్మిది తెగల ఆదివాసీలు స్పష్టం



నినాదాలు చేస్తున్న ఆదివాసీ పెద్దలు, రాయిసెంటర్ సార్‌మెడీలు

నార్నూర్: జైనూర్‌లో ఆదివాసీ మహిళపై అత్యాచారానికి పాల్పడిన షేక్ ముఖ్దుంను ఫాస్ట్‌కోర్టు ద్వారా విచారణ జరిపించాలని, ఆ మృగాడికి ఉరిశిక్ష పడేంత వరకు ఉద్యమిస్తామని ఆదివాసీలు స్పష్టం చేశారు. మండలంలోని మాన్కాపూర్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన తొమ్మిది తెగల ఆదివాసీలు, రాయిసెంటర్ సార్ మెడీలు జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్, రాయి సెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు మాట్లాడుతూ 1970లో వలసవచ్చిన మైనార్టీలకు సంబంధించి భూయాజమాన్య హక్కుపత్రాలు, ఆధార్, రేషన్, కరెంట్ బిల్లులు వెంటనే రద్దుచేసి ఏజెన్సీ నుంచి వారిని ప్రభుత్వమే తరలించాలన్నారు. అలాగే మైనార్టీలకు వత్తాసు పలికే అధికారులను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల చివరివరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే 'మా ఊరిలో మా రాజ్యం'ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఆదివాసీలపై తప్పుడు కేసులు పెడితే సహించేది లేదని హెచ్చరించారు. ఇందులో తుడుందెబ్బ రాష్ట్ర కన్వీనర్ భూర్చ పోచయ్య, కొడప నగేశ్, గేడం గణేశ్, కొట్నాక్ విజయ్, బాపూరావు, విజయ్, ప్రభాకర్, పెందూర్ పుష్పరాణి, ఖమ్ము, మనోజ్, సార్‌మెడీలు భీంరావ్, దౌలత్‌రావు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# దొంగలుగా అనుమానించి దాడి..



61వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రాంపూర్ గ్రామస్తులు

- రాంపూర్‌లో రాత్రి ఆగిన వాహనం
- దాడి చేసిన గస్తీకాసిన ఇద్దరు గ్రామస్తులపై కేసు
- వారి అరెస్టుతో పలువురు రాస్తారోకో



మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు ఇటీవల వరుసగా పశువులు, మేకలు, గొర్రెలను ఎత్తుకెళ్తున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు గ్రామంలో రాత్రి గస్తీ కాస్తున్నారు. ఆదివారం వేకువ జామున ఓ వాహనం ఆగింది. అందులో ఉన్న వారిని దొంగలుగా భావించి గస్తీ కాస్తున్న గంగాధర్, ఎల్లయ్య దాడి చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేయడంతో రాంపూర్‌వాసులు నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నర్సాపూర్(జి)పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి మాట్లాడారు. తెల్లవారుజామున 2.50 గంటల ప్రాంతంలో భైంసా నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం రాంపూర్ వద్ద మొరాయించింది. గస్తీ తిరుగుతున్న ఇద్దరు గ్రామస్తులు.. డ్రైవర్ ఒబేద్, షేక్ రఫీలను విచారించారు. భైంసా వాసులమని, కూరగాయల వ్యాపారం చేస్తుంటామని తెలిపారు. వారిని దొంగలుగా భావించి చితకబాదారు. దాడిచేసిన గంగాధర్, ఎల్లయ్యలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

**గ్రామస్తుల రాస్తారోకో**

గంగాధర్, ఎల్లయ్యను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ నర్సాపూర్ (జి) పోలీస్‌స్టేషన్ 61వ జాతీయ రహదారిపై గ్రామస్తులు రాస్తారోకో చేపట్టారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్రమ కేసులు బనాయించడం సరికాదన్నారు. సుమారు రెండు గంటల పాటు రాస్తారోకోతో కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భైంసా సీఐ నైలు, సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్, దిలావర్‌పూర్ ఎస్సై రాజేశ్వర్‌గౌడ్, కుంటాల ఎస్సై భాస్కరాచారి గ్రామస్తులను సముదాయించడంతో రాస్తారోకోను విరమించారు.

### అదుపుతప్పి కారు బోల్తా



బోల్తాపడ్డ కారు

నేరడిగొండ: కారు అదుపుతప్పి బ్రిడ్జి పైనుంచి బోల్తాపడ్డ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి..మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి ఓ కుటుంబం కారులో కుంటాల జలపాతం వద్దకు వస్తున్నారు. ఆదివారం సాయంత్రం రోల్‌మామడ జాతీయ రహదారి బ్రిడ్జి పైనుంచి బోల్తా పడింది. టైర్ బ్లాస్ట్ కావడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో షేక్ అబ్దుల్ సత్తార్, ఫకీర్‌షా, షేక్ ఫాతిమాలకు తీవ్ర గాయాలు కాగా, నజ్మ, ఫాతిమ అజ్మ, సోహెల్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. మరో నలుగురు చిన్నారులు సురక్షితంగా బయటపడ్డారు. ఎన్‌హెచ్‌ఏఐ, 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను బయటకు తీశారు. వారిని నిర్మల్ ఆస్పత్రికి తరలించారు.

### ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్ సర్వే

ఇచ్చోడ: ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు ఇచ్చోడ మీదుగా రైల్వేలైన్ సర్వే ప్రారంభమైంది. మండలంలోని జామిడి వద్ద యంత్రంతో ఆదివారం సిబ్బంది ఈ సర్వే నిర్వహించారు. వాగులు, కొండలు, గుట్టలు తొలగించడానికి సర్వే చేపడుతున్నట్లు తెలి పారు. రెండు రోజుల నుంచి సర్వే చేపట్టడంతో ఇక్కడి ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### సిలిండర్ లీకేజీతో మంటలు

ముథోల్: మండలంలోని చించాలలో ఆదివారం ఇంటి ఆవరణలో సిలిండర్ లీకేజీతో మంటలు వ్యాపించాయి. సాగర ఉదయం ఇంటి బయట సిలిండర్‌పై వంట చేస్తుండగా ఆకస్మాత్తుగా లీకేజీతో భారీ మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ఆమె, కుటుంబీకులు బయటకు పరుగులు తీశారు. చుట్టుపక్కల వారు వచ్చి మంటలార్పివేశారు. ఈ ప్రమాదంలో కరెంట్ వైరింగ్‌తో పాటు, ఇంటి భాగం స్వల్పంగా కాలిపోయినట్లు బాధితురాలు తెలిపింది.

# పోరాటయోధుల ఆశయసాధనకు కృషి

- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్



భీం విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు

తలమడుగు: పోరాటయోధుల ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు, మాజీమంత్రి జోగు రామన్నతో కలిసి మండల కేంద్రంలో కుమురం భీం, చాకలి ఐలమ్మల విగ్రహాలను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడారు. భూమి, భుక్తి, హక్కుల కోసం భీం, చాకలి ఐలమ్మలు పోరాటం చేశారన్నారు. ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందించాలన్నారు. వారి విగ్రహాలు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోరాటయోధుల చరిత్ర తెలుసుకోవాలన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ భీం, ఐలమ్మ స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఒకే వేదికపై మూడు పార్టీల ప్రజాప్రతినిధులు హాజరవడం సంతోషంగా ఉందన్నారు. మాజీమంత్రి జోగు రా మన్న మాట్లాడుతూ గ్రామాల్లో పోరాట యోధుల విగ్రహాలు ఏర్పాటు చేయడం ఐక్యతకు నిదర్శనమన్నారు. మాజీ జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్యాణ లక్ష్మి రాజేశ్వర్, మీజీ ఎంపీటీసీ చంటి, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, మండల అధ్యక్షుడు పోచన్న, మాజీ సర్పంచ్ రమేశ్, దంజీ పటేల్, అభిరామ్ రెడ్డి, మండల కన్వీనర్ వెంకటేశ్, బీసీ సంఘం అధ్యక్షుడు రవికాంత్ యాదవ్, కేదరేశ్వర్‌రెడ్డి, బీజేపీ మండల కన్వీనర్ స్వామి, బీసీ సంఘం జిల్లా నాయకులు సంతోష్, మండల అధ్యక్షులు ఆశన్న, లింగన్న, త్రియంబక్ శ్రీనివాస్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

**దాతలకు సన్మానం**

భీం,ఐలమ్మ విగ్రహాల నిర్మాణం కోసం నిధులు అందించిన దాతలు వసంతరెడ్డి, పిడుగు సంజీవ రెడ్డి, మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, కిష్టారెడ్డితో పాటు సామాజిక కార్యకర్త మానిష్‌రెడ్డిలను సన్మానించారు. సంఘాల నాయకులు ఉన్నారు.

### చికిత్స పొందుతూ యువకుడు మృతి

తాంసి: పాముకాటుకు గురైన యువకుడు రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..భీంపూర్ మండలం పిప్పల్‌కోటికి చెందిన పెద్దింటి భూమన్న-పాచ్చుబాయి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, కుమార్తెకు వివాహమైంది. కుమారుడు ప్రభు(25) కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడునెలల క్రితం తండ్రి భూమన్నకు కాలు విరిగింది. ప్రభు..డ్రైవర్‌గా పని మానేశాడు. గురువారం పంట చేల్లో పనిచేస్తుండగా అతని కాలిపై పాము కాటేసింది. స్థానికులు వెంటనే రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ప్రభు మృతితో పిప్పల్‌కోటిలో పండగపూట విషాదఛాయలు అలుముకున్నాయి.

### రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్ చెక్ పోస్టు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఎస్సై సుమలత కథనం ప్రకారం.. కడెంకు చెందిన డింగ్య దర్శన్ (30), తండ్రి ఓమని కలిసి పనినిమిత్తం బైక్‌పై శనివారం నిర్మల్‌కు బయల్దేరారు. ఈ క్రమంలో గజ్జల రాజేశ్వర్ టీవీఎస్ ఎక్సెల్‌పై అతి వేగంగా నిర్మల్ వైపు నుంచి వస్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది.దర్శన్, తండ్రి ఓమనికి తీవ్ర గాయాలయ్యాయి. రాజేశ్వర్, భార్య గంగామణికి గాయాలు కాగా, వారిని నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. ఓమని కుమారుడు జోగేందర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# 'ఇన్‌స్టా' స్నేహితుడు... 20 రోజులు నిర్బంధించాడు!

- భైంసా బాలికకు సోషల్ మీడియాలో యువకుడితో పరిచయం
- ట్రాప్‌చేసి హైదరాబాద్‌కు రప్పించి లాడ్జిలో నిర్బంధం
- తల్లిదండ్రులకు సమాచారం అందించిన బాధితురాలు
- రంగంలోకి దిగిన సిటీ షీటీమ్స్
- యువతిని రక్షించి కుటుంబ సభ్యులకు అప్పగింత

సాక్షి, సిటీబ్యూరో:సోషల్‌మీడియా ద్వారా పరిచయమైన ఓ యువకుడు నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన బాలికను ట్రాప్ చేశాడు. 20 రోజుల క్రితం నగరానికి రప్పించి ఓ హోటల్‌లో నిర్బంధించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఎట్టకేలకు ధైర్యం చేసిన బాధితురాలు తన కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ఆదివారం నగరానికి చేరుకున్నారు. హైదరాబాద్ షీటీమ్స్‌ను ఆశ్రయించడంతో బాలికను రక్షించారు. నిందితుడిపై నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన బాలికకు నగరానికి చెందిన యువకుడితో ఇన్‌స్టాగామ్ యాప్ ద్వారా పరిచయం ఏర్పడింది. కొన్నాళ్లు స్నేహం నటించిన సదరు యువకుడు ఆమెను పూర్తిగా నమ్మించాడు. చివరకు తన అసలు రూపం బయటపెట్టి 20 రోజుల క్రితం బాలికను బెదిరించాడు. దీంతో భయపడిన బాలిక తల్లిదండ్రులకు చెప్పకుండా నగరానికి వచ్చేసింది. ఆమెను కలుసుకున్న అతను నారాయణగూడలోని ఓ లాడ్జికి తీసుకువెళ్లి గదిలో నిర్బంధించాడు. పదేపదే అఘాయిత్యానికి ఒడిగట్టాడు. అతడి బెదిరింపులకు భయపడిన ఆమె మిన్నకుండిపోయింది. చివరకు ఆదివారం ధైర్యం చేసిన బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసి తన పరిస్థితిని వివరించింది. వాట్సాప్ ద్వారా కరెంట్ లొకేషన్ షేర్ చేసింది. హుటాహుటిన నగరానికి వచ్చిన బాలిక తల్లిదండ్రులు షీటీమ్స్‌ను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన షీటీమ్స్ నారాయణగూడలోని లాడ్జిపై దాడి చేసి బాలికను రెస్క్యూ చేశారు. తల్లిదండ్రులను చూసిన బాలిక ఉద్వేగానికి గురైంది. సదరు యువకుడిపై బాలిక తల్లిదండ్రులు నారాయణగూడ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

### 'వీసీని తొలగించాలి'

ముథోల్: బాసర ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణను వెంటనే తొలగించాలని ఓయూ జేఏసీ అధ్యక్షుడు సర్దార్ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులను వీసీ పట్టించుకోవడం లేదన్నారు. ట్రిపుల్ ఐటీ అక్రమాలు, బిల్లుల్లో కమీషన్లు, కాంట్రాక్టుల్లో అవినీతి, సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తున్నారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రెగ్యులర్ వీసీని నియమించడంతోపాటు విద్యార్థుల 17 డిమాండ్లు నెరవేర్చాలన్నారు.

### గంజాయి మొక్కల స్వాధీనం

బజార్‌హత్నూర్: మండలంలోని గోకొండ గ్రామంలో శనివారం వంద గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అప్పారావ్ తెలిపారు. గ్రామానికి చెందిన చందేల్ కిసాన్‌సింగ్, అజాడ ఇంద్రజిత్, జట్వే చందర్‌సింగ్, అజాడే నానక్‌సింగ్‌లకు చెందిన పంట చేనులో సాగు చేస్తున్న 100 గంజాయి మొక్కలను సీఐ రమేశ్ ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.